క్లుప్తంగా

ఎగువపల్లెలో సివిల్ రైట్స్ డే

నిమ్మనపల్లె : మండలంలోని తవళం పంచాయతీ ఎగువపల్లెలో బుధవారం పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవం(సివిల్‌రైట్స్ డే) సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కే.అమరనాథ్ తెలిపారు. ప్రతినెలా 30వ తేదీన మండలంలోని ఒక గ్రామంలో పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవ సమావేశాన్ని నిర్వహించి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎగువపల్లెలో సివిల్ రైట్స్‌డే సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అన్ని శాఖల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత నాయకులు, సమావేశానికి తప్పక హాజరుకావాలని అన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

మదనపల్లె : కోడిపందెం ఆడుతున్న ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ మాదినిగుంటకనుమ ప్రాంతంలో కోడిపందెం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. దాడిలో పెద్దమండ్యం మండలం వెంగంవారిపల్లెకు చెందిన సదాశివనాయుడు(46), మదనపల్లె రామిరెడ్డి లేఅవుట్‌కు చెందిన జి.రెడ్డెప్ప(47), సి.రామాంజులు(42), ఎస్.రమణ(45), మిట్టామ్రివాండ్లపల్లెకు చెందిన గంగరాజు(34), రామారావు కాలనీకి చెందిన వెంకటప్పనాయుడు(36), రెడ్డీస్‌కాలనీకి చెందిన సుధాకర్(40)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.5,400 నగదు, రెండు కోళ్లు, ఐదు మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి

మదనపల్లె సిటీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని జైభీమ్ అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ అడ్వయిజర్ బొబన్న అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ వన్,టు డిపోల్లో జైభీమ్ అసోసియేషన్ ప్రారంభించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆర్టీసీ వన్ డిపో ఎదుట సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్మికులకు అండగా ఉంటామన్నారు. మదనపల్లె వన్ డిపో జైభీమ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా తోట కళ్యాణ్, మదనపల్లె-2 డిపో సెక్రటరీగా శ్రీనాథ్, జిల్లా అధ్యక్షులుగా పి.నయంతుల్లాను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలి



ఆర్టీసీ వన్ డిపో ఎదుట నినాదాలు చేస్తున్న జైభీమ్ అసోసియేషన్

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. పట్టణం రోజు రోజుకు శరవేగంగా విస్తరిస్తోందన్నారు. ప్రతి రోజు పరిసర ప్రాంతాల నుంచి రైతులు, విద్యార్థులతో పాటు పలువురు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం కేవలం ట్రాఫిక్ చెక్‌పోస్టు మాత్రం ఉందన్నారు. దీంతో పాటు సిబ్బంది లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

సిద్దవటం : విద్యార్థులు పుస్తకాలను చదవితే పూర్తిగా విజ్ఞానం సొంతమవుతుందని గ్రంథాలయాధికారి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం, నీతి పద్యాలు చెప్పించడం, ఆటల పోటీలు నిర్వహించారు.

పెద్దకాల్వపల్లెకు అందుతున్న తాగునీరు



గ్రామంలో ఉన్న బోరు బావికి మోటారు ఏర్పాటు చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రాయచోటి : పెద్దకాల్వపల్లెలో దాహం కేకలు వార్తపై అధికారులు స్పందించారు. గ్రామ అవసరాలకు తవ్విన బోరునకు మోటారు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. రాయచోటి రూరల్ మండలం ఎండపల్లి పంచాయతీ పెద్దకాల్వపల్లెలో తాగునీరు లేక చందా డబ్బులతో ట్యాంకర్లతో నీళ్లు తెచ్చుకుంటున్నారన్న 'సాక్షి'(సోమవారం) కథనంపై అధికారులు స్పందించారు. ఇప్పటికే గ్రామ అవసరాలకు తవ్వించి పెట్టిన బోరు బావికి మోటార్ ఏర్పాటు చేసి ప్రజలకు మంగళవారం నుంచి తాగునీటిని అందించారు. అధికారులు బోరు మోటారు ఏర్పాటు చేయడంతో గ్రామ ప్రజలు 'సాక్షి'కి అభినందనలు తెలిపారు.

నష్టాల్లో అన్నదాత..బీమాపైనే ఆశ

- ఈఏడాది ధరల పతనంతో భారీగా నష్టాలు
- మార్కెట్లో ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధర ఏదీ?
- వాతావరణ ఆధారిత బీమాపైనే రైతుల ఆశలు



కొత్తపల్లెలో వంకాయలు కోయకుండా తోటల్లో వదిలేసిన దృశ్యం



ధరలు పతనమవడంతో పశుగ్రాసంగా మారిన టమాటాలు

గుర్రంకొండ: ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలకు గిటుటబాటు ధర లేకపోవడంతో రైతుల కష్టాలను తీర్చే వారు కరువయ్యారు. జిల్లాలో రైతులు సాగు చేసిన ఏఒక్క పంటకు కూడా మార్కెట్లో గిట్టుబాటు ధరలు లభించక పోవడతో ఈ ఏడాది రైతులు రూ.203 కోట్ల మేరకు నష్టపోయారు. గత ఏడాది ఇదే సీజన్‌లో టమాటా, పూల సాగు, వంగ పంటలకు మంచి గిట్టుబాటు ధర లభించాయి. ఈ ఏడాది మాత్రం ఒక్క పంటకు కూడా మార్కెట్లో ధరలు లేక పోవడంతో రైతుకు కనీసం పంట సాగుకు ఖర్చు చేసిన పెట్టుబడి కూడా అందక నష్టపోతున్నాడు. కనీసం వాతావరణ ఆధారిత పంటల బీమా అయినా తమను ఆదుకొంటుందా అంటూ రైతులు ఎదురుచుస్తున్నారు.

గుండెకోత మిగిల్చిన టమాటా

ఈ ఏడాది టమాటా పంట సాగు రైతులకు గుండెకోత మిగిల్చింది. రైతులు పండించిన పంటకు అశించిన మేరకు ధరలు లేక పోవడంతో లబోదిబోమంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం 12200 మంది రైతులు 12800 ఎకరాల్లో టమాటా పంట సాగు చేసారు. పంటసాగు కోసం ఇప్పటికే రూ.256 కోట్లు ఖర్చు చేశారు. అయితే ఈసీజన్‌లో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక పోవడంతో రూ.165 కోట్ల మేరకు రైతులు నష్టపోయారు. మార్కెట్లో ప్రస్తుతం 25కేజిల టమాటా క్రేట్ ధర రూ.200లోపే ధర పలుకుతోంది. సగటున సరాసరి కిలో టమాటా రూ.5లోపే ధర ఉంది. ఒక ఎకరం పంట సాగుకు రైతుకు పంట కోతకు వచ్చే వరకు రూ. 2లక్షల వరకు ఖర్చు అవుతోంది. ప్రస్తుతం మార్కెట్లో టమాటా ధరలు అంతంత మాత్రంగా ఉండడంతో మార్కెట్‌కు టమాటాలను చేర్చేవరకు అయ్యే ఖర్చు కూడా రైతులకు మిగలడం లేదు. టమాటా కోతకూలీలు, రవాణా ఖర్చులు, కమీషన్లు, జాక్‌పాట్‌లు కలుపు కొంటే మార్కెట్‌కు టమాటాలను తీసుకొచ్చే రైతులకు తమ చేతి నుంచే అదనపు ఖర్చు వస్తుండడంతో బెంబేలెత్తిపోతున్నారు. పలువురు రైతులు నాలుగు కోతలు కోసి ఆ తరువాత పంటను అలాగే పొలంపై వదిలేస్తున్నారు. టమాట పంట పశువులకు మేతగా మారుతోంది.

వంగ రైతుకు మిగలింది బెంగే

ఈ ఏడాది వంగ పంట సాగు చేసిన రైతులకు బెంగే మిగిలింది. జిల్లాలో ఈ సీజన్‌లో 1810 మందిరైతులు 2450 ఎకరాల్లో వంగ పంట సాగు చేశారు. నారు మొక్కలు నుంచి దుక్కులు, ఎరువులు, మందులు, కూలీల ఖర్చు కలుపుకొంటె ఎకరం పంట సాగుకు రూ. 70 వేలు నుంచి రూ. 80 వేల వరకు ఖర్చు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో వంగ ధర రూ.10 వరకు ధర పలుకుతోంది. జిల్లాలో సాగు చేసే వంగను ఎక్కువగా తమిళనాడు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోని మార్కెట్లకు తరలిస్తుంటారు. కోత కులీలు, రవాణాఖర్చులు, కమీషన్లు లెక్కిస్తే రైతుకు ఎమి మిగలడం లేదు. దీంతో పంటసాగు భారంగా మారుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది ఇదే సీజన్‌లో కిలో వంగ మార్కెట్లో రూ.20 నుంచి రు.30 వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం తమిళనాడులో వంగ సాగు అక్కడి మార్కెట్లకు ఎక్కువగా వస్తుండడంతో పాటు డిమాండ్ తక్కువగా ఉండడంతో వంగ ధరలు పతనమయ్యాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి. దీంతో రైతులు చే సేదిలేక సంగ పంటకోతలు అయిన తరువాత కాయలు కోయకుండా తోటల్లోనే వదిలేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో వంగసాగు చేసిన రైతులకు రూ.16 కోట్ల మేరకు పంట నష్టం వాటిల్లింది.

కోయకుండా తోటల్లోనే వదిలేస్తున్న పూలు

జిల్లాలో టమాటా తరువాత ఎక్కువగా రైతులు సాగు చేసేది పూల పంట. టామాటాకు ధరలు లేకపోయిన పూలకైనా ధలు వస్తాయనే ఎంతో ఆశతో పూలసాగు చేసిన రైతులు ఈ ఏడాది నిరాశే మిగిలింది. జిల్లా మొత్తం 2350 మంది రైతులు 3150 ఎకరాల్లో పూల సాగు చేపట్టారు. నారుమొక్కలు, ఎరువులు, దుక్కులు, మల్చింగ్ కవర్, కూలీల ఖర్చు కలుపుకొంటే ఎకరం బంతిపూల సాగుకు రూ. 80 వేలు నుంచి రూ.లక్షవరకు ఖర్చు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో సగటున కిలో బంతిపూల ధర రూ. 10 వరకు ధరలు పలుకుతున్నాయి. కోతకూలీలు, రవాణా ఖర్చులు, కమీషన్లు, ఇతరత్రా ఖర్చులు కలుపుకొంటే పులను మార్కెట్‌కు తీసుకెళ్లే రైతులు ఖాళీ చేతులతో వచ్చేస్తున్నారు. గత ఏడాది ఇదే సీజన్‌లో బంతి పూల ధరలు కిలో రూ. 40 నుంచి రూ.50 వరకు ధరలు పలికాయి. ఈసీజన్‌లో మాత్రం రైతులకు నిరాశే మిగిలింది. కనీసం పంట సాగు కోసం ఖర్చు చేసిన పెట్టుబడికుడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో పూల రైతు దిగాలు చెందుతున్నాడు.

పంటల బీమాపైనే ఆశలు

ఈ ఏడాది ప్రస్తుత సీజన్‌లో పూర్తి స్థాయిలో పంటలు నష్టపోయిన రైతులందరు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంపైనే ఆశలు పెట్టుకొన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది ఉద్యానవన పంటల బీమా పథకం అమలు చేసింది. ఈపథకం కింద రైతువాటాగా కొంతమేరకు డబ్బులు కటిం చుకొన్నారు. పంటలు దెబ్బతింటే ఈ పంటల బీమాకింద ప్రభుత్వం పంటనష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఈ పథకంపై ఆశలు పెట్టుకొని వేచి చూస్తున్నారు. ఈసీజన్‌లో టామటాతో పాటు కూరగాయాలు, పూలపంటల సాగుకు గిట్టుబాటు ధరలు లేక రైతులు పూర్తిగా నష్టపోయారు. ఈక్రాప్ నమోదు కింద పంటలు సాగు చేసిన రైతులు పంటల బీమా చేసుకొన్నారు. ఈ పథకమైనా తమను గట్టెక్కిస్తుందేమోనని రైతులు ఎదురుచూస్తున్నారు. గమనార్హం.

రెండు ఎకరాల్లో నష్టపోయాం



రెండు ఎకరాల్లో రెండు రకాలు వంగ సాగును చేపట్టాం. అయితే పంట చేతి కందే సమయానికి మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేవు. దీంతో పంట పూర్తిగా నష్టపోయాం. సుమారు రూ.1.50 లక్షల మేరకు పెట్టుబడి సాగు ఖర్చుతో నష్టపోయాం. గత ఏడాది ఇదే సీజన్‌లో వంగ పంటకు మార్కెట్లో మంచి ధరలు పలికాయి. ఇప్పుటు మార్కెట్లో కిలో వంగ రూ.10 వరకు ధరలు పలుకుతున్నాయి.

- నాగమ్మ, మొరంపల్లె

పెట్టుబడి రావడం లేదు:



మార్కెట్లో టమాటాలకు గిట్టుబాటుధరలు లేక పోవడంతో చాలా నష్టపోయాం. ఈసీజన్‌లో ఎకరం టమాటా పంట సాగు చేశాను. రూ. 2 లక్షలవరకు పెట్టుబడి కోసం ఖర్చు చేశాను. ఇప్పటివరకు రూ. 20 వేలు కూడా చేతికందలేదు. కనీసం సగం పెట్టుబడి డబ్బులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. పంటనష్టపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- నరసింహారెడ్డి, కొత్తపల్లె, గుర్రంకొండ మండలం

పంటల బీమాతో ఆదుకోవాలి



జిల్లాలో రైతులు సాగు చేస్తున్న ఒక్క పంటకు ఈ ఏడాది గిట్టుబాటు ధరలేక పోవడం దారుణం. ప్రభుత్వం పంటల బీమా పథకం కింద రైతుల్ని ఆదుకోవాలి. ముఖ్యంగా కష్టపడి సాగు చేసిన టమాటా పంటకు మార్కెట్లో ధరలు లేకపోవడం వేలాది మంది రైతులు నష్టపోయారు. ప్రభుత్వం పంటల బీమా చేసుకొన్నవారి తోపాటు బీమా చేసుకోని రైతుల్ని కూడా ఆదుకోవాలి. **- రమేష్‌బాబు, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు, గుర్రంకొండ**

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పెద్దతిప్పసముద్రం: గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్న నేపథ్యంలో మండలంలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ హరిహర ప్రసాద్ సూచించారు. మంగళవారం ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు. బయట రాష్ట్రాల్లో కూలి పనులు లేనందున అపరిచిత వ్యక్తులు సునాయాసంగా డబ్బులు సంపాదించే క్రమంలో చోరీలకు పాల్పడుతున్నారన్నారు. ప్రధానంగా రైతుల వ్యవసాయ బోర్ల వద్ద పగలు రెక్కీ నిర్వహించి రాత్రి వేళ చోరీలు చేస్తున్నారన్నారు. రైతులు అపరిచిత వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. అదే విధంగా బోర్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిదని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ హరినారాయణ

ములకలచెరువు: సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని ఎంపీపీ సాయిలీలా అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై సర్పంచులు, ఎంపీటీసీలకు సమాచారం అందించాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, గ్రామస్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు : స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. 3వ తరగతికి ఎస్టీ 32, ఎస్సీ 5, బీసీ 2, ఓసీలకు ఒక సీటు మొత్తం 40 సీట్లు ఖాళీలున్నట్లు తెలిపారు. అలాగే నాలుగో తరగతిలో 33, ఐదో తరగతి 39, ఆరో తరగతి 35, ఏడో తరగతి 29, ఎనిమిది తరగతి 34, తొమ్మిదో తరగతి 29 సీట్లు ఎస్టీ విద్యార్థులు ఖాళీలున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు నేరుగా సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చునని కోరారు.

ఆలయ భూములను పరిరక్షించుకోవాలి



శ్రీలక్ష్మీ జనార్దన్‌స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎండోమెంట్ ఏసీ విశ్వనాథ్

రామసముద్రం: ఆలయాలలో పూజలతో పాటు ఆలయాలకు సంబంధించిన భూములను కూడా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండలంలోని డీడీఎన్ఎస్ దేవాలయాలను ఆయన పరిశీలించారు. ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు ధూపదీప నైవేద్యం కింద ఉన్న ఆలయాలను సందర్శించి, పూజాకై ంకర్యాలను పరిశీలించారు. చెంబకూరు, రామసముద్రం, ఊలపాడు, ఉప్పినెల్లి , ఆర్.నడింపల్లి, వనగానిపల్లి, గుంతయంబాడి, కురిజల తదితర గ్రామాలలోని ఆలయాలను పరిశీలించి ఆలయ చరిత్రలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్చకుల పూజ కైంకర్యాలకు ఎలాంటి ఆటంకము కలగకుండా గ్రామ ప్రజలు అభివృద్ధికి సహకరించాలన్నారు. ఆలయాల్లో సీసీ కెమెరాలను పరిశీలించారు. అలాగే దేవాలయ భూములు లీజుకు తీసుకున్న రైతులు లీజు మొత్తాన్ని నిర్దేశించిన గడువులోపు చెల్లించాలని , లేకపోతే నోటీసులు జారీ చేస్తామన్నారు. గుంతయంబాడిలో ఆలయాల భూముల లీజు వసూళ్లకు చర్యలు తీసుకుంటామని అర్చకులు మల్లికార్జునదీక్షిత్‌కు తెలిపారు. అనంతరం కురిజలలో నూతనంగా నిర్మిస్తున్న చెన్నరాయస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఈఓ రమణ, సిబ్బంది రాజేష్, అర్చకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటిపొర చికిత్స శిబిరానికి స్పందన



ఉచిత కంటి వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మదనపల్లె : పట్టణంలోని బెంగళూరురోడ్డు జీఆర్టీ హైస్కూల్‌లో ఏఆర్ఎస్ఆర్ చారిటబుల్ ఫౌండేషన్, శంకర నేత్రాలయ కంటివైద్యశాల చెన్నై వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం శంకర నేత్రాలయ యూఎస్ బోర్డు మెంబర్ రాజశేఖర్‌రెడ్డి ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ...ఏప్రిల్ 29 నుంచి మే 5వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కంటి పొరను పరీక్షిస్తామన్నారు. పరీక్షల్లో కంటి శుక్లం(పొర) కలిగిన వారికి మాత్రమే మే 3 నుంచి 7 వరకు మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ వాహనంలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించి, మందులు అందజేస్తామన్నారు. మదనపల్లె నియోజకవర్గ ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీటీ కాలేజ్ కరస్పాండెంట్ వైఎస్.మునిరత్నం, జీఆర్టీ స్కూల్ ప్రిన్సిపాల్ జగన్‌మోహన్, రామచంద్ర, లోకల్ వలంటీర్స్ నారాయణరెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసులు, చిన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టెంవారిపల్లిలో రోడ్డు ఆక్రమణ పరిశీలన



చిట్టెంవారిపల్లెలో రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ భానుప్రసాద్

రామసముద్రం: రామసముద్రం మండలం అరికెల పంచాయతీ చిట్టెంవారిపల్లి గ్రామంలో రోడ్డు ఆక్రమించారంటు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదుపై మంగళవారం ఎంపీడీఓ భానుప్రసాద్ పరిశీలించారు. గ్రామాన్ని సందర్శించి విచారించినట్లు ఎంపీడీవో తెలిపారు. రికార్డులను పరిశీలించి దురాక్రమణ జరిగినట్లు రుజువైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అంత వరకు గ్రామాల్లో ఒకరిపై ఒకరు గొడవలు చేసుకోవద్దని సూచించారు. అలాగే మాలేనత్తం సచివాలయంను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిని పరిశీలించి , సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రజలు తాగునీటి ఎద్దడికి గురికాకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. తాగునీరు , పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

మే 10 నుంచి జయంత్యుత్సవాలు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రెడ్డివారిపల్లి శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవస్థానంలో మే 10 నుంచి మూడు రోజుల పాటు నారసింహుని జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక ఆలయ చైర్మన్ పంద్రా నరసింహులు తెలిపారు. మంగళవారం స్థానిక దేవస్థానంలో ఉత్సవాల గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తేదీన ధ్వజారోహణం, మహాహోమం, 11న స్వాములవారి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 12న రథోత్సవ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎంయూ రిలేదీక్షలు



రిలేదీక్షలు చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు



పీలేరు ఆర్టీసీ డిపో వద్ద రీలే దీక్ష చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

మదనపల్లె సిటీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో రెండో రోజు మంగళవారం రిలేదీక్షలు చేశారు. ఎన్ఎంయూ కడప జోనల్ అధ్యక్షులు వినోద్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రిలేదీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. దీక్షలు చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. దీక్షలో ఎన్ఎంయూ రీజనల్ చైర్మన్ సుందర్‌రాజు, రాములు, అధ్యక్ష, కార్యదర్శులు చలపతి, మునికృష్ణ, రెడ్డిబాషా, శీనా, గంగులప్ప,రమణ పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి

పీలేరురూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పి.ఎస్.ఎం. రాజు అన్నారు. మంగళవారం స్థానిక డిపో కార్యాలయం వద్ద రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండో రోజూ రిలేదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సర్క్యులర్‌ను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. నైట్ అవుట్ అలవెన్స్‌లు రూ. 400 చేయాలని కోరారు. హైయర్ పెన్షన్ సమస్య సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. ఎలక్ట్రానిక్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థే కొనుగోలు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్యవిధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ డ్యూటీకి డబుల్ వేతనం ఇవ్వాలన్నారు. ఆన్‌కాల్ డ్రైవర్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ బి.ఆర్.బి. నాయక్, సి.వి. రమణ, ఆదినారాయణ, సుబ్బరామయ్య, హెచ్ఎం. నాయుడు, ఎం.ఎస్. నాయక్, కె.కె. నాయుడు, హరి, వి.ఎల్. నాయకులు, కె.ఎస్ రామయ్య, పి.ఎస్. రాములు, ప్రమీల, నిర్మల, ఎం.ఎస్. మణ్యం, బి.జి. నాయుడు, ఎం. లక్ష్మయ్య, బి.వి.ఎస్. నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్

రాజంపేట : రాజంపేట పటణంలో సీఐ రాజ ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మరంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. అలాగే వాహనాలను తనిఖీ చేసి వాటి రికార్డులను పరిశీలించారు. అలాగే గ్రామంలో ఎవరైనా అక్రమంగా నివసిస్తున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం గ్రామస్తులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తదుపరి సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సెల్‌ఫోన్ ఎంతవరకు అవసరమో అంతవరకే వినియోగించాలని, అనవసరమైన మేసేజ్‌లు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న సీడీపీఓ సౌభాగ్యమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : అవగాహన లేకుండా బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, జైలు శిక్ష తప్పదని మంగళవారం సీడీపీఓ సౌభాగ్యమ్మ తెలిపారు. స్థానిక మండల సభా భవనంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధిత చట్టం 2006 ప్రకారం 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్ల లోపు అబ్బాయిలకు వివాహం చేయడం నేరమన్నారు. పిల్లలకు చదివే వయసులో వివాహాలు చేయకూడదని సూచించారు. గ్రామాలలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగార్జున, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కఠినతరం చేయాలి



సీఐ యుగంధర్‌కు వినతిపత్రం ఇస్తున్న వివిధ సంఘాల నాయకులు

పీలేరు : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కఠినతరం చేయాలని దళిత సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం సీఐ యుగంధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గం మల్లాం గ్రామంలో ఎస్సీలను సంఘ బహిష్కరణ చేయడం దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అయినా ఇప్పటికీ దురాచారాలు కొనసాగడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు అగ్రవర్ణాల చేతుల్లో ఉన్నన్నాళ్లు ఎస్సీ, ఎస్టీల మీద అరాచకాలు జరుగుతూనే ఉంటాయన్నారు. తక్షణమే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించి ఈ ఘటనపై తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ధరణి కుమార్, టి.ఎల్. వెంకటేష్, శ్రీకాంత్, మూడే హరి నాయక్, బోడేషావలి, ద్వారకనాథ్, రెడ్డెయ్య, ఇబ్రహీమ్, బావాజి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

సాక్షి ఎఫెక్ట్..



ట్యాంకరు వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని ఇట్నేనివారిపల్లెలో తాగునీటి సమస్యపై మంగళవారం సాక్షి దినపత్రికలో ఇట్నేనివారిపల్లెలో తాగునీటి కష్టాలు అన్న శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వినోద్‌లు స్పందించారు. గ్రామానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేశారు. గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

ఘనంగా కొత్తపురమ్మ విగ్రహ పునఃప్రతిష్ట

సంబేపల్లె : ఆదిపరాశక్తి స్వరూపిణి, దుద్యాల గ్రామ ఆరాధ్య దేవత శ్రీ కొత్తపురి ఎల్లమ్మ (కొత్తపురమ్మ) నూతనంగా నిర్మించారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ట పూజలు రెండు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ప్రాతఃకాల పూజలు, అభిషేకాలు, చండీ సప్తశతి పారాయణం, దేవిభాగవతా పారాయణం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, దీక్షా హోమాలు తదితర పూజా క్రతువులను వేదపండితుల ద్వారా జరిపించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం అమ్మవారి విగ్రహప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు.